ప్రజాశక్తి
సోమవారం 6 జనవరి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

వైసిపి కౌన్సిలర్లకు

అధికార పార్టీ గాలం.!

- ఇప్పటికే పలువురు కౌన్సిలర్లతో మంతనాలు
- మీ వార్డులో మీదే పెత్తనమంటూ హామీ!

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. మార్కాపురం మున్సిపాలిటీలో మాత్రం వైసిపిదే పెత్తనం. మున్సిపాలిటీలో ఏడాదికి పైగా వైసిపి పాలన కొనసాగనుంది. అధికార పార్టీకి వైసిపి పెత్తనం మింగుడు పడలేదు. అధికార టిడిపి అనుకున్న పనులు సకాలంలో జరగడం లేదు. అందుకు వైసిపి పాలక పక్షం సహకరించడం లేదని టిడిపి ఆరోపిస్తోంది. వైసిపి ప్రజాప్రతినిధులు మాత్రం తమను మాటమాత్రమైనా అడగకపోతే తామెందుకు సహకరించాలనే ధోరణిలో ఉన్నట్లు సమాచారం.

మార్కాపురం మున్సిపాలిటీలో కొన్ని పనులు అనుకున్న సమయానికి జరగడం లేదు. కీలకమైన పనులకు కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి కావడంతో అధికారపార్టీకి చెందిన ముఖ్యమైన ప్రజాప్రతినిధి ▶ 2లో

సవాల్‌గా భూసమస్యల పరిష్కారం

- 22ఎ కింద చేర్చిన భూములపై కొనసాగుతున్న గందరగోళం
- భూముల వివరాలపై నివేదిక కోరిన రెవెన్యూశాఖ మంత్రి
- రెవెన్యూ సదస్సుల్లోనూ కుప్పలుతెప్పలుగా 'భూ' అర్జీలు

కనిగిరిలో రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఏళ్ల తరబడి వివిధ పేచీలతో కొనసాగుతున్న భూ వివాదాల పరిష్కారం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. పరిష్కారం ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. రెవెన్యూ శాఖ ప్రస్తుత పనితీరుపై ఆ శాఖ ఉన్నతాధికారులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో ఇప్పుడున్న భూవివాదాలు పరిష్కారం ఎలా? ఎప్పటికి.? ఈ ప్రక్రియను పూర్తి చేస్తారన్నదే ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ భూ సమస్యలపై రీజనల్‌స్థాయి సదస్సు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్లు హాజరయ్యారు. ఎమ్మెల్యేలూ పాల్గొని భూ సమస్యలపై వివరించారు. ఇక భూ వివాదాల్లో కీలకమైన 22ఏ కింద ఉన్న భూములపైనే తీవ్రంగా చర్చ సాగింది. వీటిని ఎలా పరిష్కరించాలనే దానిపై దృష్టి సారించాలని రెవెన్యూ మంత్రి అధికారులను ఆదేశించారు. ముందుగా నిషేధిత భూముల వివరాలు నివేదించాలని కోరారు. నిషేధిత భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? ప్రైవేటు భూమి ఎంత? దేవాదాయ భూమి ఎంత? వక్ఫ్‌బోర్డు ఎంత? వివాదాల్లో ఉన్న భూమి ఎంతనేది మూడు రోజుల్లో నివేదికలు ఇవ్వాలని జేసీలను ఆదేశించారు. దీంతో ఇప్పుడు భూముల వివరాలు సేకరించే పనిలో యంత్రాంగం ఉంది. సర్వే నెంబర్లు తప్పిదాలు, ప్రభుత్వ భూమిలో ఒకరిద్దరికీ పట్టాలు ఇచ్చి మిగతా భూమి ఖాళీగా ఉండటం, ఇనాంభూములు, దేవాదాయశాఖ భూముల్లో నివాసాలు ఉండటం, చట్టాలకు విరుద్ధంగా పట్టాలు పొందడం, ఇలా పలు కారణాలతో వివాదం ఉన్న భూములను గత ప్రభుత్వ హయాంలో నిషేధిత భూముల జాబితాలో పెట్టారు. వీటిని '22ఏ' జాబితాగా నమోదు చేశారు. దీంతో ఈ భూముల యజమానులు అమ్ముకోవాలన్నా, ఇతర అవసరాల కోసం వినియోగించుకోవాలన్నారికార్డుల్లో 22ఏ కింద చూపుతోంది. దీనిపై ▶ 2లో

ఒంగోలులోని వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

బాగా చదువుకొని

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా ▶ 8లో

పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

▶ 8లో

అర్హులకే పింఛన్లు

- కలెక్టర్ జె.వెంకటమురళి
- నేటి నుంచి వికలాంగుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రప్రభుత్వం పంపిణీ చేస్తున్న వివిధ రకాలయిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అర్హులైన లబ్ధిదారులకే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి రూ.15వేలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను సోమవారం నుంచి ప్రత్యేక వైద్య బృందాల ద్వారా నిశితంగా పరిశీలించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం వీక్షణ సమావేశం ద్వారా అధికారులతో సమీక్ష చేశారు. వివిధ రకాల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అనర్హులు పొందుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా పింఛన్లు పొందే వారిని తొలగించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 6 నుంచి 28 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపడుతున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేక వైద్య బృందాలను ▶ 2లో

సవాల్‌గా భూసమస్యల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు అర్జీలు ఇస్తున్నారు. తీసేయాలంటే గ్రామస్థాయి నుంచీ కలెక్టర్ వరకూ ఫైల్ నడవాలి. కారణం చూపాలి. ఇందులో ప్రైవేటు పట్టాల భూములు కూడా ఇరుక్కున్నాయి. స్పష్టంగా ఫైలు కలెక్టర్ వరకూ రావాలి. ఇక్కడ అప్రూవల్ ఇస్తే నిషేధం తొలుగుతుంది. ఈ ఫైళ్లు కింద నుంచి పైకి రావడం లేదు. రెవెన్యూ అధికారులు నిషేధిత భూముల జోలికి పోవడం లేదు. గతంలోనే వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. యంత్రాంగం క్రియాశీలకంగా వ్యవహరించడం లేదు. దీంతో నిషేధిత భూముల సమస్య యథాతథంగా ఉంది. ఇప్పటికీ అర్జీలు ఇస్తూనే ఉన్నారు. తాజాగా మంత్రి అనగాని ప్రసాద్ వీటిపై దృష్టి సారించారు. మూడు రోజుల్లో నివేదిక కోరారు. రాష్ట్రంలో 1.88 కోట్ల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నట్లు తేల్చారు. జిల్లాలోనూ లక్షలాది ఎకరాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. వీటి వివరాలు తేలాల్సి ఉంది. ఇప్పటివరకూ అరకొర సమాచారమే ఉంది. ఇక ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లోనూ కుప్పలుతెప్పలుగా అర్జీలు భూసమస్యలపై వస్తున్నాయి. వాటి పరిష్కారం ఏమిటన్నదీ కనిపించడం లేదు. ఇప్పటివరకూ 20 వేలకు పైగానే వచ్చాయి. ఇక ఒంగోలులో భూ కుంభకోణాలపైనా విచారణ నిలిచింది. నకిలీ స్టాంపులతో భూ వివాదాలు తెరపైకి వచ్చాయి. సిట్ ఏర్పాటుచేసినా విచారణ మధ్యలోనే ఆగిపోయింది. దీనిపైనా విచారణ చేయించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కోరారు. రియల్‌ఎస్టేట్ వెంచర్లలో అసైన్డ్ భూములను కలిపేసుకున్నారు. సాగర్ కాలువలు కబ్జాలకు గురయ్యాయి. కనిగిరి ప్రాంతంలో వేలాది ఎకరాల అసైన్డ్‌భూముల్లో వెంచర్లు వేశారు. జనం కొన్నారు. వీటిని ఇటీవల తొలగించారు. ప్లాట్లు కొన్న జనం బాధితులుగా తేలారు. ఇంకా స్మశాన వాటికలు, పొలాలకు వెళ్లే దారులు, చెరువులు, కుంటలు, కబ్జాలకు గురయ్యాయి. మార్కాపురం ప్రాంతంలో ప్రభుత్వ భూములను తారుమారు చేసినందుకు తహశీల్దార్, విఆర్ఒలు పెద్దఎత్తున చర్యలకు గురయ్యారు. పొదిలి సమీపంలో పెద్ద చెరువు ఆక్రమణకు గురైంది. గతంలో నిర్వహించిన రీ సర్వేలోనూ తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇలా అనేక చోట్ల భూ వివాదాలు కొనసాగుతున్నాయి. వీటిని పరిష్కరించడమే పెద్ద ఎజెండాగా ఉంది.

అర్హులకే పింఛన్లు

(మొదటిపేజీ తరువాయి)

నియమించామన్నారు. జిల్లాలోని 25 మండలాల్లో 643 మంది నడవలేని స్థితితో మంచాలకే పరిమితమై ఉండి రూ.15 వేల చొప్పున పింఛన్లు పొందుతున్న వారి అంగవైకల్య శాతాన్ని మరోసారి వైద్యబృందాలు పరిశీలన చెయ్యడం జరుగుతుందన్నారు. ప్రత్యేక వైద్యబృందాలు పక్షవాతం, రోడ్డు ప్రమాదాలు ఇతర కారణాలతో మంచాలకే పరిమితం అయిన వారిని వారి నివాసాల వద్దకే వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలన చేస్తారన్నారు. వారికి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. పింఛనుదారులు వైద్యబృందాలకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

నిర్మాణ రంగం కుదేలు

పనుల్లేక వలసబాటలో భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నిర్మాణ రంగం కుదేలైంది. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కరికీ ఇల్లు మంజూరు చేసిన దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో నిరుపేదలందరికీ ఇంటిస్థలం కేటాయించి ఇల్లు నిర్మించి మరీ ఇస్తామన్న కూటమి నేతలు ఆ దిశగా ఏ రకమైన చర్యలూ చేపట్టలేదు. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు సైతం ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో చాలాచోట్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో ఇళ్లు లేక లబ్ధిదారులు, పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో నిధుల కొరత లేకుండా..

గతంలోని వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లూ నిర్మాణ రంగానికి ఎటువంటి నిధుల కొరత లేదు. అర్హతా ప్రామాణికంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలు కూడా చేసి ఇవ్వడంతో ఇంటి కల సాకారమైందని అటు లబ్ధిదారులు, చేతినిండా పని దొరికి ఉపాధి లభించిందని ఇటు భవన నిర్మాణ కార్మికులు ఆనందించేవారు. దీంతో పాటు సొంతంగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు కూడా జరిగేవి. అయితే ఇప్పుడు రాష్ట్రంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ హయాంలో మాత్రం ఇంతవరకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదు. దీనికి తోడు నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు సంబంధించి, బిల్లులు కూడా చేయకపోవడంతో చాలాచోట్ల భవన నిర్మాణాలు ఆగిపోయాయి. అలాగే ఇసుక ధరలు కూడా భారీగా ఉండడంతో నిర్మాణ రంగం దివాలా తీసిందని, ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తాపీమేస్త్రీలు, కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీలేక వారంతా పనుల కోసం హైదరాబాద్, బెంగుళూరు నగరాలకు వలస పోతున్నారు.

నిధులు మంజూరు చేయకపోవడంతో..

పక్కా గృహాలు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేక, సకాలంలో నిధులు మంజూరుకాక లబ్ధిదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. యర్రగొండపాలెం మండలంలో జగనన్న లే అవుట్‌లో 609 పక్కా గృహాలు మంజూరు కాగా 120 మాత్రమే పూర్తయ్యాయి. పుల్లలచెరువు మండలంలో 167కు గాను 27 మాత్రమే పూర్తయ్యాయి. త్రిపురాంతకం మండలంలో 598కు గాను 102 మాత్రమే పూర్తయ్యాయి. పెద్దదోర్నాల మండలంలో 253 పక్కా గృహాలు మంజూరు కాగా 47 మాత్రమే పూర్తయ్యాయి. పెద్దారవీడు మండలంలో 173కు గాను 56 మాత్రమే పూర్తయ్యాయి. అలాగే సొంత స్థలాలు ఉన్న వారికి యర్రగొండపాలెం మండలంలో 355 పక్కా గృహాలు మంజూరు కాగా 276 మాత్రమే పూర్తయ్యాయి. పుల్లలచెరువు మండలంలో 476 పక్కా గృహాలు మంజూరు కాగా 311 మాత్రమే పూర్తయ్యాయి. త్రిపురాంతకం మండలంలో 511 పక్కా గృహాలు మంజూరు కాగా 347 మాత్రమే పూర్తయ్యాయి. పెద్దదోర్నాల మండలంలో 221 పక్కా గృహాలు మంజూరు కాగా 144 మాత్రమే పూర్తయ్యాయి. పెద్దారవీడు మండలంలో 227 పక్కా గృహాలు మంజూరు కాగా 175 మాత్రమే పూర్తయ్యాయి.

నిర్మాణాలు నిలిచిపోయిన గృహాలు

గ్రామాల్లో సర్వే..

ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయకుండా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేస్తూ కాలయాపన చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇళ్లు మంజూరు కాని వారు ఎంతమంది ఉన్నారు, తప్పనిసరిగా ఇల్లు కడితేనే మంజూరు చేస్తామని, కొంత కట్టి అసంపూర్తిగా వదిలేస్తే మంజూరు చేయబోమని చెబుతూ సర్వేలో స్పష్టమైన హామీని లబ్ధిదారులు (ఇళ్లు కట్టాలనుకునే వారు) నుంచి తీసుకుంటున్నారు. ఆరు నెలల్లో ఎక్కడా ఎటువంటి నిర్మాణాలు జరగకపోవడంతో ఇళ్లు ఆశించేవారు, ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయినవారు, భవన నిర్మాణ కార్మికులంతా ఎప్పుడు ఇళ్లు ఇస్తారా? ఎప్పుడు నిర్మాణాలు జరుగుతాయా? అని ఎదురుచూస్తున్నారు. నిర్మాణ రంగాన్ని బతికించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిరోజూ పని ఉండడం లేదు

చిరదల నాగేష్, తాపీ మేస్త్రీ, యర్రగొండపాలెం

గతంలో పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. అప్పట్లో చేతి నిండా పని ఉండేది. కుటుంబ పోషణ సులభమైంది. ఇప్పుడు ఎక్కడా నిర్మాణాలు అంతగా జరగకపోవడంతో ప్రతిరోజూ పని ఉండడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

గుర్రం లక్ష్మీనారాయణ, తాపీ మేస్త్రీ, యర్రగొండపాలెం

పక్కా గృహాల నిర్మాణాలు జరగకపోవడంతో నిర్మాణ రంగ కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. ఇసుక ధరతో పాటు గృహ నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతుండడంతో నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేస్తే మాకు పని దొరుకుతుంది. అప్పటి దాకా ఇబ్బంది పడాల్సి వస్తోంది. నిర్మాణ రంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యవసాయ రంగ రక్షణకు బలమైన ఉద్యమం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవటానికి బలమైన రైతు కూలీ ఉద్యమం నిర్మిద్దామని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఈమనిపాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభల సావనీర్ ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది. సావనీర్‌ను ఆవిష్కరించిన సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ గిరిజనులు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు, రైతుకూలీలు, ఉపాధి హామీ లాంటి అనేక అంశాలను ఈ సావనీర్‌లో పొందుపరిచారన్నారు. రైతు రంగంలో పనిచేస్తున్న కార్యకర్తలు అందరూ తప్పకుండా అధ్యయనం చేయాలన్నారు. 1991 బూటకపు ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జనానికి మాయమాటలు చెప్పడం, అధికారంలోకి రాగానే అప్రకటిత నియంతృత్వం, కార్పొరేట్లకు ఊడిగం చేయడం పాలక వర్గాలకు అలవాటుగా మారిందన్నారు. సావనీర్‌పై ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ 2001 నుంచి క్రమం తప్పకుండా వెలువడుతున్న రైతుకూలీ సంఘం మహాసభల సావనీర్‌ల్లో ఇది 11వదని అన్నారు. రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ లలిత కుమారి అధ్యక్షత వహించారు. సభలో ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు ఎంఎస్ సాయి, రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు ప్రసంగించారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు శివరామకృష్ణయ్య, శ్రీను, జయబాబు, శామ్యూల్, జి వెంకటరావు, ఐ విజయసారధి, కత్తి పేరయ్య పాల్గొన్నారు.

7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టావెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

రాష్ట్రంలోని వినియోగదారుల విద్యుత్ టారిఫ్ నిర్ణయించటానికి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపిఈఆర్‌సి) ఈ నెల 7, 8, 10 తేదీలలో విజయవాడ, కర్నూలులో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఏపిసిపిడిసిఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపిఈఆర్‌సి) ఆధ్వర్యంలో 2025-2026 సంవత్సరానికి విద్యుత్ టారిఫ్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో అన్ని విద్యుత్ డివిజన్, సర్కిల్ కార్యాలయాలలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నార న్నారు. మూడు రోజుల పాటు ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడలో, 10న కర్నూలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ వినియోగదారులు వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. ప్రకాశం జిల్లా నుంచి ఒంగోలు సర్కిల్ కార్యాలయంలో, కందుకూరు డివిజన్, కనిగిరి డివిజన్, దర్శి డివిజన్, మార్కాపురం డివిజన్ కార్యాలయాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొని వారి అభిప్రాయాలను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 లోపు తెలియజేయ వచ్చన్నారు. వినియోగదారుల అభిప్రాయాలను ఏపిఈఆర్‌సి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయవచ్చన్నారు. వ్యక్తిగతంగా తెలియ జేసే వినియోగదారులు ముందుగా వారి పేర్లను ఏపిఈఆర్‌సి సెక్రటరీ వద్ద రిజిస్టర్ చేసుకొని ఈనెల 7, 8 తేదీల్లో విజయ వాడలో, 10న కర్నూలులో హాజరై తెలియజేయాలన్నారు. వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని వారి అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన కోరారు.

వైసిపి కౌన్సిలర్లకు అధికార పార్టీ గాలం.!

(మొదటిపేజీ తరువాయి)

సైతం ఏమీ చేయలేకున్నారు. అధికారులు సైతం కౌన్సిల్ ఆమోదం లేకుండా ముందుకు వెళ్లలేమని తేల్చిచెప్పడం జరిగింది. మున్సిపాలిటీలో వైసిపికి 30 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఒకరు చనిపోయారు. టిడిపి ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికార టిడిపి ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. వైసిపి కౌన్సిలర్లలో తమతో వచ్చే వారి కోసం అన్వేషణ ప్రారంభించింది. వైసిపి కౌన్సిలర్లతో ఇటీవల మంతనాలు ముగిశాయి. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు కందుల రామిరెడ్డి కౌన్సిలర్లకు గాలం వేసే పనిలో ఉన్నారు. ఒక్కో కౌన్సిలర్‌ను ఇంటికి పిలిపించుకుని టిడిపిలోకి రావాలని కోరడం జరుగుతోంది. 'మీ వార్డులో మీరే అధిపతి.. మీ పనులు క్షణాల్లో జరిగేలా చర్యలు తీసుకుంటాం' అని హామీ ఇస్తున్నారు. 'పంతాలకు పోవడం ఎందుకు... మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి' అని అడుగుతున్నారు. వైసిపికి చెందిన 29 మంది కౌన్సిలర్లలో అత్యధిక మందితో ఈ పాటికే రహస్యంగా మంతనాలు జరిపినట్లు తెలిసింది. కొందరు మాత్రం వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సముఖత చూపడం లేదని సమాచారం. టిడిపిలో ఉన్న వారికే ప్రస్తుతం సరైన గౌర వం లేదని, తాము అక్కడ చేరి ఏమి చేయాలనే భావనలో కొందరు ఉన్నట్లు తెలిసింది. సిఎం చంద్రబాబు ఎన్నికల హామీలు కూడా అమలు చేయక పోవడంతో జనంలో కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ సమయంలో టిడిపి పంచన చేరినా జనంలో తాము కూడా పలచన అవుతామనే ఆలోచనలో కొందరు కౌన్సిలర్లు ఉన్నట్లు తెలిసింది. ఈ నెల 9న టిడిపిలో చేరికలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. వైసిపి నుండి గుంటక సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ షెక్షావలి చేరుతున్నారు. వారితో పాటు మరి కొందరు కౌన్సిలర్లు టిడిపిలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు పేర్లు బహిరంగంగా వినిపిస్తున్నా యి. సుమారు 10 మంది కౌన్సిలర్లు టిడిపికి దగ్గరవుతున్న ట్లు ప్రచారం జరిగింది. ప్రస్తుతం మాత్రం ఇదర్దు లేదా ముగ్గురు మాత్రమే ఈ నెల 9న చేరుతారని తెలిసింది. ఈ నెల 9న చేరిక తరువాత మరోసారి మరికొందరికితో మంత నాలు జరిపే అవకాశం అవకాశం లేకపోలేదు. మొత్తానికి మార్కాపురం మున్సిపాలిటీలో టిడిపి పాగా వేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుత పాలకపక్షానికి నాలుగేళ్లు పూర్తయిన తరువాత అవిశ్వాసంతో కొందరి కౌన్సిలర్ల సహకారంతో టిడిపి ఛైర్మన్ పీఠం దక్కించుకునే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులపై 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సామాజిక తనఖీలు నిర్వహిస్తున్నట్లు సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్పి వెంకటేశ్వర్లు తెలియచేశారు. కొండపి మండలంలో 2023-2024 సంవత్సరంలో జరిగిన 19 పంచాయతీలలో 508 పనులకు సంబంధించిన పనులపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం 10 మంది డిఆర్పిలు, సహాయక సిబ్బంది 11 మంది, ఎస్ఆర్పి 1 ఆద్వర్యంలో గ్రామాలలో జరిగిన ఉపాది హామి పనులు తనిఖీలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయా గ్రామాలలో తనిఖీ పూర్తి అయిన వెంటనే గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం మండల సభ ఈనెల 18వ తేదీన మండల కార్యాయలం వద్ద నిర్వహించడం జరుగుతుందన్నారు.

గ్రామాల వారీగా తనిఖీలు

సామాజిక తనిఖీ బృందం మండలంలో 19 పంచాయతీలో తనిఖీ నిర్వహిస్తున్నారు. కొండపి పంచాయతీలో జి.దిలీప్‌కుమార్, డి.ప్రవీణ్‌కుమార్, జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేది నుంచి 11వతేదీ వరకు నిర్వహించి గ్రామసభ 11వ తేదీ నిర్వహిస్తారు. ఇలవరలో 4 నుంచి 8వరకు గ్రామసభ 8వ తేదీన, చోడవరంలో 8 నుంచి 10 వరకు గ్రామసభ 10వ తేదీన, పెట్లూరులో 7 నుంచి 10 వరకు గ్రామసభ 10వ తేదీన, గుర్రపడియలో 4 నుంచి 7 వరకు గ్రామసభ 7వ తేదీన, చినకండ్లగుంటలో 4 నుంచి 8 వరకు గ్రామసభ 8వ తేదీన, మూగచింతలో 8 నుంచి 11 వరకు గ్రామసభ 11వ తేదీన, అనకర్లపూడిలో 4 నుంచి 7 వరకు గ్రామసభ 7వ తేదీన, వెన్నూరులో 7 నుంచి 10 వరకు గ్రామసభ 10వ తేదీన, కె.ఉప్పలపాడులో 10 నుంచి 11 వరకు గ్రామసభ 11వ తేదీన, నెన్నూరుపాడులో 4 నుంచి 7 వరకు గ్రామసభ 7వ తేదీన, మిట్టపాలెంలో 7 నుంచి 10 వరకు గ్రామసభ 10వ తేదీన, ముప్పరాజుపాలెంలో 10 నుంచి 11 వరకు గ్రామసభ 11వ తేదీన, పెదకండ్లగుంటలో 4 నుంచి 7 వరకు గ్రామసభ 7వ తేదీన, ముప్పవరంలో 7 నుంచి 9 వరకు గ్రామసభ 9వ తేదీన, కట్టుబడిపాలెంలో 9 నుంచి 11వరకు గ్రామసభ 11వ తేదీన, పెరిదేపిలో 7 నుంచి 9 వరకు గ్రామసభ 9వ తేదీన, చినవెంకన్నపాలెంలో 4 నుంచి 7 వరకు గ్రామసభ 7వ తేదీన, గోగినేనివారిపాలెంలో 9 నుంచి 11 వరకు 11వ తేదీన గ్రామసభలు ఉంటాయని ఎస్ఆర్పి వెంకటేశ్వరరావు తెలిపారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

'ఉపాధి' పనుల్లో అవినీతి బయట పడేనా..?

కొండపి మండలంలో 2023-24 ఉపాధి హామీ పనులలో భారీ అవినీతి చోటు చేసుకున్నట్లుగా మండలంలో ప్రచారం జరుగుతోంది. దొంగ మస్టర్లు వేయడం, పను లు లేకుండా పనులు ఉన్నట్లు సృష్టించడం లాంటివి జరి గాయని మండలంలో చర్చించుకుంటున్నారు. ఇదే తరహాలో 2022-23 సంవత్సరంలో జరిగిన 569 పనులలో దాదాపు రూ.65 లక్షలు అవినీతి జరిగినట్లు సామాజిక బృందం గుర్తించి నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందజేసింది. జరిగిన అవినీతిపై ప్రభుత్వం నుంచి అధికారులు చర్యలు తీసుకున్న పరిస్థితి లేదని ప్రజలు బహిరం గంగానే విమర్శిస్తున్నారు. మండల కేంద్రమైన కొండపి పంచాయతీలోనే రూ.3,59,34,995 విలువైన పనులు జరగగా అందులో కేవలం కోటి రూపాయాలు పనులు మాత్రమే సామాజిక తనిఖీ వారు తనిఖీ చేశారు. మిగిలిన పనులను వీలులేని కారణంగా వాటిని తనిఖీ చేయనట్లు రికార్డులు రాశారు. చేసిన కోటి రూపాయలలోనే దాదాపు 17 లక్షలు అవినీతి జరిగినట్లుగా తనిఖీ బృందం ఉన్నత అధికారులకు నివేదికను అందించింది. అదే తరహాలో 2023-24 సంవత్సరంలో జరిగిన ఈ పనులలో భారీ అవినీతి జరిగి ఉంటుందని ఆయా గ్రామాలలో ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సామాజిక తనిఖీలలోనైనా నిజనిజాలు విచారించి అవినీతి బట్టబయలు చేసి ప్రజా ధనాన్ని కాపాడాలని మండలంలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మేత మందులు సరఫరా చేయాలి

మేకలు, గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుపతిరావు

ప్రజాశక్తి-బాపట్ల

గొర్రెలు, మేకలకు మేత మందులు నిరంతరాయంగా సరఫరా చేయాలని మేకలు గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన గొర్రెలు, మేకల పెంపకందారుల జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ గొర్రెలు, మేకలు పెంపకందారులు ఐక్యతతో తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. మేకలు, గొర్రెలను రోగాల బారి నుండి కాపాడుకునేందుకు ప్రభుత్వం సంచార వైద్యశాలలను నడపాలన్నారు. సమాజానికి పౌష్టికాహారం అందిస్తున్న ఈ రంగాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గొర్రెల పెంపకందారుల 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎం.ఆది శేషు, బుర్రి ఆంజనేయులు, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి.కొండయ్య, ఎలమంద, సుబ్బారావు, గోపి, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిరుపతిరావు

ఐలవరం సచివాలయ సిబ్బంది అద్దేపల్లికి తరలింపు

ఆందోళన చెందుతున్న ఐలవరం గ్రామస్తులు

ప్రజాశక్తి- భట్టిప్రోలు

మేజర్ పంచాయతీగా ఉన్న భట్టిప్రోలు మండలంలోని ఐలవరం గ్రామానికి ప్రభుత్వం కేటాయించిన రెండు సచివాలయ పరిధిలోని కొంతమంది సిబ్బందిని భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామానికి తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండల కేంద్రంగా ఉన్న భట్టిప్రోలు గ్రామానికి జనాభా ప్రాతిపదికన నాలుగు సచివాలయాలను కేటాయించాల్సి ఉంది. కానీ ఆనాడు అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకుల నిర్లక్ష్యం కారణంగా 20 వేల జనాభా కలిగిన భట్టిప్రోలుకు రెండు సచివాలయాలు మాత్రమే కేటాయించారు. అది కూడా పాత పంచాయతీ కార్యాలయంలోనే ఒక సచివాలయం కొనసాగుతుండగా మరో సచివాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. రెండవ సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ స్థానిక నాయకులు దాని నిర్మించేందుకు ముందుకు రాలేదు. అయితే భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ఐలవరం గ్రామం కూడా ఉండటం వలన అద్దేపల్లి గ్రామ రైతులకు వీఆర్వో ఐలవరం గ్రామంలోనే ఉండటం వలన వారికి పలు కార్యక్రమాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. దీని దృష్ట్యా ఇటీవల జరిగిన అద్దేపల్లి రెవెన్యూ సదస్సులో రైతులు ఆర్డీవోకి సమస్యను వివరించారు. దీంతో అద్దేపల్లి గ్రామానికి కూడా సేవలు అందే విధంగా ప్రణాళికలో సిద్ధం చేసి ఐలవరం గ్రామంలోని ఒక సచివాలయంలో పనిచేసే సిబ్బంది కొందరిని అద్దేపల్లికి కేటాయించి పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేశారు.

ఐలవరం గ్రామ సచివాలయం

ఐలవరం పరిస్థితి ఏమిటి..?

మేజర్ పంచాయతీ ఐలవరం గ్రామంలో రెండు సచివాలయాల ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందుతున్నాయి. కానీ ఐలవరం గ్రామంలో రెండవ సచివాలయం నుంచి కొందరు సిబ్బందిని అద్దేపల్లికి డిప్యూటేషన్‌పై తరలిస్తే ఐలవరం గ్రామంలో పాలన కుంటుపడుతుందేమోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వం కేటాయించిన రెండు సచివాలయ భవనాల నిర్మాణాలను పూర్తి చేశారు. ప్రభుత్వ పక్కా భవనాలు ఉన్న సచివాలయ సిబ్బందిని అద్దేపల్లికి తరలించి అద్దె భవనంలో కొనసాగించాలని అధికారులు యోచించడం సరైనది కాదని వ్యాఖ్యానిస్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న నాయకులు గ్రామానికి అందాల్సిన సచివాలయాలపై దృష్టి సారించాలే తప్ప ఒకసారి సచివాలయం సిబ్బందిని మరో ప్రాంతానికి తరలిస్తే ఇక్కడ సమస్య ఏర్పడుతుందని దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలన జరపాలని ఐలవరం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ మేజర్ పంచాయతీగా ఉన్న భట్టిప్రోలుకు ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు రకాల సర్వేలు పూర్తికాక సమస్యలు తలెత్తుతున్నాయని దీని దృష్టిలో ఉంచుకొని పరిపాలనా సౌలభ్యం కోసం తాత్కాలికంగా కొందరు సిబ్బందిని అద్దేపల్లికి డిప్యూటేషన్‌పై కేటాయించడం జరిగిందన్నారు. ఐలవరంలో పాలన సమస్యలు ఎదురైతే తిరిగి మరల ఐలవరం గ్రామానికి కేటాయించడం జరుగుతుందని, పూర్తిస్థాయిలో అద్దెపల్లి గ్రామానికి కేటాయించడం లేదని దీనిపై ఐలవరం గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు.

సాంబయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

పల్లపోలు సాంబయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-వేటపాలెం

రాష్ట్ర సోషలిస్ట్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షునిగా పనిచేసిన పల్లపోలు సాంబయ్య 32వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. వేటపాలెం పంచాయతీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు నాగ మనోహర్ లోహియా మాట్లాడుతూ మా నాన్న ఆశయాలు కొనసాగిస్తానన్నారు. గతంలో బాపట్ల పార్లమెంటుకు పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారని ఆయన గొప్ప ప్రజాదరణ గల వ్యక్తి అని కొనియాడారు. వేటపాలెం మున్సిపాలిటీని రద్దు చేయించడంలో ప్రముఖ పాత్ర పోషించాడన్నారు. మోటుపల్లి ఎత్తిపోతల పథకం సాధించటం గొప్ప గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వసంతకుమారి, సిపిఎం మహిళా ప్రతినిధి, విజయనిర్మల, ఉష, సింధు, షరీఫ్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

పేకాట స్థావరాలపై ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. రామాపురం పొలాల్లో పలువురు యువకులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఆ శిబిరంపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,350 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రామాపురంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో తనిఖీ చేశామన్నారు. ఇలాంటి ఆటలు ఆడుతున్నట్లు ఎవరైనా గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు పక్కనే చెత్త

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

డంపింగ్ యార్డుకు తరలించాలని వేడుకోలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌కు సమీపంలో అద్దంకి- నార్కెట్ పల్లి రహదారి వెంట చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డులో ఉండాల్సిన చెత్త, వ్యర్థాలు రహదారి వెంటే పడేస్తున్నారు. ఈ బస్టాండ్ సెంటర్‌లో పదికి పైగా చికెన్, మటన్ షాపులు ఉన్నాయి. అంతేగాక ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఉన్నాయి. వాటి వ్యర్థాలు మొత్తం రహదారి వెంటే పడేస్తున్నారు. దీనివల్ల గ్రామంలో అంటు రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులులు స్పందించి వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కొమ్మాలపాడు బస్టాండ్ సమీపంలో రహదారి వెంట పేరుకుపోయిన వ్యర్థాలు

మాట్లాడుతున్న ఆర్టీసీ ఫెడరేషన్ నాయకులు

విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటుపరం చేయెుద్దు

ప్రజాశక్తి-బాపట్ల

ఆర్టీసీని పూర్తిగా బలోపేతం చేస్తామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం 2029 కల్లా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టి ఆర్టీసీ కార్మికులకు అన్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని బాపట్ల ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కుమార్, తిరుమలరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బాపట్లలో విలేకరులతో మాట్లాడారు. కాలుష్య రహిత విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టి ప్రస్తుతం ఉన్న బస్సులను పూర్తిగా తొలగించి విద్యుత్ బస్సుల పేరుతో ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేటు పరం చేయెుద్దన్నారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తే 46 వేల మంది ఆర్టీసీ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీకి సమకూర్చే రాయితీలతో ఆర్టీసీని మరింత బలోపేతం చేయాలన్నారు. విద్యుత్ బస్సులు ఆర్టీసీలో ప్రవేశపెట్టినప్పటికీ ఆర్టీసీ సిబ్బందిని యథాతథంగా కొనసాగించాలన్నారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బంకులు స్థానంలో బస్సులకు విద్యుత్తు చార్జి కేంద్రాలను ఆర్టీసీకి అప్పగించాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న సాంకేతిక సిబ్బందిని విద్యుత్ బస్సులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంలో సాంకేతిక శిక్షణ ఇచ్చి వారిని కొనసాగించాలన్నారు. ఆర్టీసీ ప్రైవేట్ పరమైతే ప్రజలపై మరింతభారం పెరుగుతుందన్నారు. ఆర్టీసీని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కలుపు నివారణకు మందు కొడితే..

మొక్కలు ఎండుతున్నాయ్..!

ఎండిపోయిన మొక్కజొన్న

కల్తీ మందుతో మొక్కజొన్న ఎండుముఖం

రైతులను నిలువునా ముంచిన కంపెనీ

ప్రజాశక్తి - పంగులూరు

మొక్కజొన్న రైతును అగస్త్య కంపెనీ నిలువునా ముంచింది. మొక్కజొన్న పంటలో కలుపు నివారణకు మందు కొడితే మొక్క ఎండుముఖం పడుతోంది. అటరాజిన్ పేరుతో ఆ కంపెనీ తయారు చేసిన కల్తీ కలుపు మందు మొక్కజొన్న పైరును ఎండబెడుతోంది. పంగులూరు మండలంలో నాలుగు గ్రామాల్లో ఈ మందును రైతులు ఉపయోగించగా ఉపయోగించిన అన్ని పొలాల్లో పంట మొత్తం ఎండిపోతోంది. ఇప్పటికి సుమారు 30 ఎకరాలు వరకు మొక్కజొన్న పైరు నిలువునా ఎండిపోయింది.

పంగులూరు మండలంలోని బైట మంజులూరు, కొండమూరు, ముప్పవరం, రేణింగవరం గ్రామాలకు చెందిన మొక్కజొన్న రైతులు మొక్కజొన్న సాగు చేశారు. పొలాల్లో కలుపు రావడంతో తొలగించేందుకు ముప్పవరంలోని హనుమాన్ ట్రేడర్స్ షాపులో అటరాజిన్ మందును తెచ్చి వేశారు. సుమారు 15 రోజుల క్రితం ఈ మందు వేయగా పైరు ఎండు ముఖం పట్టింది. ఆకులు ఎండిపోయి, మచ్చలు పడి, ఎర్రగా మారిపోతుంది. మోము ఊడి వచ్చి, మునిగిపోయిన వాసన వస్తుంది. కొంతమంది రైతులు పైరును మళ్ళీ దున్నివేసి మళ్లీ సాగుచేసినా ఆ పైరు కూడా ఇదే విధంగా వస్తుందని రైతులు తెలిపారు. ఒకవైపు మొక్కజొన్న విత్తుకునే సీజన్ దాటిపోగా, రెండోసారి విత్తినా కూడా మళ్లీ మొదటి పరిస్థితి రావడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టి నిలువునా మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించి మొక్కజొన్న పైరు బాగుందని, దిగుబడులు కూడా బాగా వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశపడుతున్న సమయంలో రైతులను అగస్త్య కంపెనీ నిలువునా ముంచిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోయిన మొక్కజొన్న పైరున రైతు సంఘం నాయకులు పూసపాటి సుబ్బరాజు, సరికొండ లక్ష్మణ రాజు, రైతులు నువ్వుల శివ నాగేశ్వరరావు, సొంటి హనుమంతరావు, గొట్టిపాటి సుబ్బారావు నాయుడు, సుబ్బయ్య నాయుడు, శ్రీను, భూమా ఓబుల్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

మందులు కొనుగోలు చేసిన ఎరువుల దుకాణం

ఎండిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రెండు ఎకరాలు మొక్కజొన్న ఎండిపోయింది

- సక్కుబాయమ్మ, మహిళా రైతు

నేను సాగు చేసిన రెండు ఎకరాల మొక్కజొన్న పైరు కలుపు మందు వేయడం వలన నిలువునా ఎండిపోయిందని బైట మంజులూరు గ్రామానికి చెందిన మహిళా రైతు సరికొండ సక్కుబాయమ్మ తెలిపింది. తాను ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడులు పెట్టి నష్టపోయానిట్లు ఆమె వాపోయింది.

పది ఎకరాలు సాగు చేశాను

- నాయుడు సుబ్బయ్య, కొండమూరు

పది ఎకరాలు కౌలు భూమి తీసుకొని, అందులో మొక్కజొన్న సాగు చేశాను. కలుపు ముందు చల్లడం వలన మొత్తం పైరు ఎండిపోయింది. ఎకరాకి రూ.20 వేలు చొప్పున పొలం కౌలుకు తీసుకొని ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను.

పైరును పరిశీలనకు పంపిస్తాను

- సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి

కల్తీ కలుపు మందు వలన ఎండిపోయిన పైరును పరిశీల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తాం. శాస్త్రవేత్తలను కూడా పిలిపించి పరిశోధనలు జరిపిస్తాం.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- రామారావు, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి

నకిలీ కలుపు ముందు చల్లటం వలన నష్టపోయిన మొక్కజొన్న రైతులందరికీ తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి. కల్తీలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది. ప్రతి ఏటా కల్తీలతో మొక్కజొన్న రైతులు నష్టపోతూనే ఉన్నారు. నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందింలి. కల్తీ కలుపు మందును తయారుచేసిన అగస్త్య కంపెనీపై చర్యలు తీసుకోవాలి.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

కరెంటు ఛార్జీలు తగ్గించాలి

సీపీఎం నాయకులు మజుందార్

కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-పర్చూరు

రాష్ట్రంలో కరెంటు చార్జీలు పెంపునకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో పర్చూరులో కరపత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. ఆ దానీ చేసిన దానికి ప్రజలను శిక్షిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సిపిఎం నాయకులు బొమ్మల సెంటర్లో కరపత్రాలను పంపిణీ చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఎం నాయకులు మజుందార్ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం నిలిపివేసి ప్రజలపై భారాలు వేయమన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని మజుందార్ అన్నారు. ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేయాలని ప్రజలకు చంద్రబాబు లోకేష్ పిలుపునిచ్చారని అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై బాదుడు కార్యక్రమం మొదలు పెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మజుందార్, మత్తె డేవిడ్, బండారు చిన్నదాసు, కె శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి గడ్డ.. మేధావుల అడ్డా

సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు - వేడుకగా సాహితీ పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి గడ్డ.. మేధావుల అడ్డా అని, అద్దంకి లేనిదే ఆంధ్ర సాహిత్యము లేదని ప్రముఖ కవి, సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. ఆదివారం అద్దంకి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లయ్య–రామలక్ష్మమ్మల సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు జొన్నవిత్తులకు పురస్కారం ప్రదానం చేశారు. జొన్నవిత్తుల దంపతులను శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఊటుకూరి రామకోటేశ్వరావు దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జొన్నవిత్తుల మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో కవులు, కళాకారులు, సాహితీ వ్యక్తులు, విశ్లేషకులతో పాటు సినీ విమర్శకులు, చరిత్రకారులు ఉండడం అరుదైన విషయం అన్నారు. తను రాసిన గేయాన్ని సభా సభ్యులు మధ్య తనదైన శైలితో ఆలపించారు. ఈ గేయం సభను ఆకర్షించింది. తెలుగును మరవద్దని, తెలుగు లేనిది మనము లేమని ఆయన అన్నారు. యువతకు ముఖ్యంగా తెలుగుపై మక్కువ కలిగేలా గేయాలు, పద్యాలు రాయాలని కవులకు సూచించారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ తెలుగు సాహిత్య రంగంలో విలక్షణ కవిగా తనదైన ముద్ర వేసి భక్తి పాటలతో పాటు దేశభక్తి గేయాలు, సినీ గేయ పాటలు, వచనలు, పుస్తకాలు వ్రాసిన జొన్నవిత్తుల రామలింగేశ్వర రావుకు ఈ పురస్కారం ప్రదానం చేయడం మన అదృష్టం అన్నారు.

జొన్నవిత్తుల దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

సమైక్యతకు ప్రతిరూపం.. జొన్నవిత్తుల కవిత్వం

శతావధాని నారాయణం మాట్లాడుతూ జొన్నవిత్తుల కవిత్వం మానవతా శిక్షణ, తెలుగు భాషా సంస్కృతుల రక్షణలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పాలపర్తి శ్యామలానంద ప్రసాదు మాట్లాడుతూ, వీరి కవిత్వం ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి ఉందన్నారు. సినీ సాహిత్య విశ్లేషకుడు వారణాసి రఘురామ శర్మ మాట్లాడుతూ వీరి పద్యాలు తెలుగువారి గుండెల్లో నిలిచిపోతాయన్నారు. ప్రముఖ సాహితీ వేత్త పోలూరి వెంకటశివరామ ప్రసాదు మాట్లాడుతూ పద్యం రాసే ప్రక్రియను యజ్ఞకార్యంగా భావించేవారన్నారు. డీవీఎం సత్యనారాయణ మాట్లాడుతూ వీరి శతకాలు సమైక్య భావనకు ప్రతీకగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని చుండూరి మురళీ సుధాకరరావు, చప్పిడివీరయ్య, కె.వి.పోలిరెడ్డి, కుందా సుబ్బారావు, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పద్యకవి డీవీఎం సత్యనారాయణ రాసి 'వ్యాసమంజూష' పుస్తకాన్ని జొన్నవిత్తుల, పాలపర్తి, ఊటుకూరి రామకోటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో వీరవల్లి రుద్రయ్య, డా.యు.దేవపాలన, నిమ్మరాజు నాగేశ్వరరావు, అడుసుమల్లి అనంత కోటేశ్వరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, అన్నమనేని వెంకటరావు, గాడేపల్లి దివాకర దత్తు, చుండూరు మురళి సుధాకర దంపతులు, కె.శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

ఎలా పనిచేస్తున్నారు.?

- మున్సిపాలిటీల్లో కమిషనర్ల పనితీరుపై ప్రభుత్వం ఆరా
- పారిశుధ్యం నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ
- చర్చనీయాంశంగా మారిన ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'మేము ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మాట్లాడుతున్నాం. మీ మున్సిపల్ కమిషనర్ రోజూ మీ పట్టణంలో తిరుగుతున్నారా.? తనిఖీలలో చురుగ్గా పాల్గొంటున్నారా..? అవును అయితే 1 నొక్కండి లేదు అయితే 2 నొక్కండి' 'మీ మున్సిపాలిటీలో పారిశుధ్యం-పరిశుభ్రత పట్ల మీరు సంతోషంగా ఉన్నారా.! అవును అయితే 1 నొక్కండి, లేదు అయితే 2 నొక్కండి' అని గత నాలుగైదు రోజులుగా నగర వాసు లకు ఫోన్‌కాల్స్ హోరెత్తు తున్నాయి. మున్సిపాలిటీలలో కమిషనర్ల పనితీరు, పారిశుధ్యం నిర్వహణపై ప్రభుత్వం ఇంట్రాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవి ఆర్ఎస్) ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది.

ఒంగోలు నగరంలోని వేలాది మంది ప్రజలకు గత నాలుగైదు రోజులుగా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని ఐవిఆర్ఎస్ ద్వారా మున్సిపాలిటీలోని వివిధ అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ఈ పరిణామం నగరవాసుల్లో పెద్ద చర్చనీయాంశమైంది. మరోవైపు ప్రభుత్వం ప్రజాభిప్రాయం సేకరిస్తుండడంతో అధికారుల లోనూ అలజడి కనిపిస్తోంది. ప్రజలు అధికారుల పనితీరు, పారిశుధ్యం నిర్వహణ, ఇతర విషయాలపై ఎలా స్పందించారనే విషయాలపై అధికారులు చర్చించుకుంటున్నారు. మన గురించి ప్రజలు మంచిగా చెప్పారా..! చెడ్డగా చెప్పారా..! అని కార్పొరేషన్ సిబ్బంది పలుచోట్ల ఆరా తీస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత మున్సిపల్ వ్యవహారాలలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో అనే విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి జరుపుకోవాలి

సిఐ ప్రభాకరరావు

సిఐ ప్రభాకరరావు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సంక్రాంతి పండుగను సంప్రదాయబద్దంగా జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని యర్రగొండపాలెం సిఐ సిహెచ్.ప్రభాకరరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం పోలీస్ సర్కిల్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో కోడి పందేలు, జూదం, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు లేవన్నారు. కోడి పందేలు నిర్వహించే వారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అశ్లీల నృత్యాలు., అసాంఘీక కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని చెప్పారు. అక్రమ మద్యం విక్రయదారులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఆకతాయిలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మద్యం సేవించి గ్రామాల్లో గొడవలు చేసినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముత్తవల్లిల కమిటీ అధ్యక్షుడిగా అలీ బేగ్

అలీ బేగ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణ ముత్తవల్లీల సంఘం అధ్యక్షులుగా జామియా మస్జిద్ ముత్తవల్లి మీర్జా సఫ్దర్ అలీ బేగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మదీనా మసీద్ ముత్తవల్లి షేక్ కరీముల్లా, సహాయ కార్యదర్శులుగా ఆటోనగర్ మజీద్ ముతవల్లి షేక్ బాషా, అన్సార్ మస్జిద్ ముత్తవల్లి మొహమ్మద్, ఉపాధ్యక్షులుగా ఇస్లాంపేట, మక్కా మస్జీదల ముత్తవల్లిలు షేక్ మున్న, మహబూబ్ పీరా, కోశాధికారిగా ఇంద్రమ్మ కాలనీ మస్జిద్ ముత్తవల్లి షేక్ షఫీ, గౌరవ అధ్యక్షులుగా చిన్న మస్జిద్ ముత్తవల్లి అబ్దుల్ రజాక్, గౌరవ సలహాదారులుగా మీనా మజీద్, కౌసర్ మసీదుల ముత్తవల్లిలు షేక్ షఫీఉల్లా, పల్నాటి రెహమాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీకి పట్టణంలోని ముస్లిం సోదరులు, మైనార్టీ నేతలు, వివిధ మసీదుల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

మధ్యంతర భృతిపై మౌనం వీడాలి

ప్రజాశక్తి-మార్కాపురం

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం మౌనం వీడాలని, మధ్యంతర భృతి 30 శాతానికి తక్షణమే ప్రకటించాలని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. మార్కాపురం జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య అధ్యక్షతన నిర్వహించిన 78వ జిల్లాకౌన్సిల్ సమావేశంలో రమణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వెంగళరెడ్డి, చల్లా శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నరసింహారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి డి.నాగయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు కడియాల ప్రసాద్, శ్యామలాదేవి, లక్ష్మీనారాయణ, సిపిఐ నాయకులు అందె నాసరయ్య, సీనియర్ నాయకులు ఇబ్రహీం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంద్ల శ్రీనివాసులు

తల్లిదండ్రులు సహకారంతోనే పాఠశాల అభివృద్ధి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం అందిస్తేనే పాఠశాల అభివృద్ధి చెందుతుందని చిన్నదోర్నాలలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంద్ల శ్రీనివాసులు తెలిపారు. ఈ పాఠశాలలో ఆదివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంద్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పాటికే పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల కావాల్సిన సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సుబ్బారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్

స్వాగతం పలికిన ఉన్నతాధికారులు

మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి కులాల ఉప వర్గీకరణకు సంబంధించి విజ్ఞప్తులను స్వీకరించేందుకు రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం ఒంగోలుకు వచ్చిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎన్ఎస్‌పి అతిథి గృహంలో కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. తొలుత రాజీవ్ రంజన్ మిశ్రాను జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.లక్ష్మి ప్రసన్న, సోషల్ వెల్ఫేర్ డిడి ఎన్.లక్ష్మానాయక్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

స్వాగతం పలుకుతున్న కలెక్టర్

చెంచు గూడెంలో సౌకర్యాలు కల్పిస్తాం

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల ఇష్టకామేశ్వరి చెంచు గూడేన్ని శ్రీశైలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కె వెంకట శివ ప్రసాద్ ఆదివారం సందర్శించారు. అక్కడి చెంచులతో మాట్లాడారు. సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి చెంచులు మాట్లాడుతూ సోలార్ సిస్టం ద్వారా తమ గూడెనికి కరెంట్ సౌకర్యం కల్పించారని, అయితే ప్రస్తుతం అవి మరమ్మతులకు గురి కావడంతో కరెంట్ లేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. స్పందించిన ఆయన రెండు రోజుల్లోనే రిపేరు చేయిస్తామన్నారు. అక్కడి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఈ మధ్య కాలంలో చనిపోవడంతో తమ పిల్లలకు చదువు చెప్పే వారు లేరని ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పది రోజుల్లోనే మరొక ఉపాధ్యాయుడిని నియమిస్తానని తెలిపారు. ఆరోగ్య సమస్యలు పర్యవేక్షించేందుకు ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. రహదారి నిర్మాణం, రక్షిత మంచినీరు, పక్కా భవనాలతో పాటు జీవనోపాధులు కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఐటిడిఏ స్పెషల్ ఆఫీసర్ కె నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెంచులతో మాట్లాడుతున్న ఐటిడిఏ పీవో

ఓపెన్ స్కూలు ఫీజు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంఈవో వి ఆంజనేయులు తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 6వ తేదీ వరకు, రూ.25 అపరాధ రుసుంతో ఈ నెల 8వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 9వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. తాత్కాల్ పథకం కింద రూ.500 అపరాధ రుసుంతో పదో తరగతి, రూ.1000 రుసుంతో ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్లు తమ స్టడీ సెంటర్లలో ప్రవేశం పొందిన విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి: ఎంపిడిఓ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బలహీన వర్గాల కోసం నిర్మిస్తున్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని ఎంపీడీవో బండారు శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పై కప్పు స్థాయికి వచ్చిన ఇళ్లను జనవరి 31 లోగా, పునాదుల స్థాయి వరకూ ఉన్న వాటిని మార్చి నెలాఖరులోగా పూర్తయ్యేటట్లు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన విషయాల్లో అన్ని రకాల సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. మార్చి నెలాఖరు వరకూ పూర్తి కాని ఇళ్లను రద్దు చేసే అవకాశముందని లబ్ధిదారులకు స్పష్టంగా చెప్పాలన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

రజకుల జీవనోపాధికి సమగ్ర చట్టం అవసరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రజకుల జీవనోపాధికి సమగ్ర చట్టం అమలు చేయాలని, ఇంటి పని వారికి వేతనం పెంచాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం నాయకులు టంగుటూరు రాము డిమాండ్ చేశారు. జిల్లా రజక వృత్తిదారుల సంఘం-2025 క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాము మాట్లాడారు. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి బతుకుదెరువు కోసం వచ్చి పట్టణ ప్రాంతంలో చాలీచాలని ఇరుకు గదుల్లో అపార్ట్మెంట్ వాచ్‌మెన్, పనివాళ్ల పనిచేస్తున్నారన్నారు. వీరి జీవనోపాధికి సమగ్ర చట్టం అవసరమన్నారు. జిల్లాలో జరుగుతున్న అనేక ఘటనలపై విచారించి పరిష్కారం దిశగా సంఘం ముందుండి పోరాడుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ రజక వృత్తిదారులకు ఒంగోలు పట్టణంలో సబ్సిడీ రుణాలు, ఇస్త్రీదారులకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ఇల్లు లేని వారికి ఇంటి స్థలం మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో రజక వృత్తిదారులకు భూ సమస్యలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. భూములు ఆక్రమిస్తున్నారని, వీటిపై చట్టపరంగా చర్యలు తీసుకొని బిసి రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసి కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల మంద రమణమ్మ, డాక్టర్ కష్టయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు మంచికలపాటి శ్రీనివాసరావు, చిట్యాల కొండయ్య, అపార్ట్మెంట్ కమిటీ సభ్యులు కలగుంట శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు యోగమ్మ, పోలయ్య, వెంకటనారాయణ, వి.మల్లికార్జున, కల్లగుంట శ్రీను, పొదిలి మల్లికార్జున, నుసుము బాలచెన్నయ్య, రజక వృత్తిదారులు పాల్గొన్నారు.

పంట పండినా వరి రైతుకు తప్పని కష్టాలు

- ముమ్మరంగా వరి కోతలు
- కూలీలకు పెరిగిన డిమాండ్
- కౌలు, పెట్టుబడికే సరిపోతున్న రాబడి
- వరిరైతుల్లో కనిపించని సంతోషం

ప్రజాశక్తి-దర్శి

ఈ ఏడాది సాగర్ నీరు రావడంతో రైతులందరూ ఎక్కువగా వరి సాగు చేశారు. గత ఏడాది సాగర్ నీరు రాక వరి లేకపోవడంతో రైతులందరూ మొదట్లో మెట్టపైరు సాగు చేశారు. అయితే సాగర్ నీరు ఆగస్టు నుండి నిరంతరాయంగా రావడంతో రైతులందరూ వరి పంట సాగు చేశారు. సాగర్ కాలువ మొదట్లో ఉన్న పొలాలను ముందుగా బీపీటి రకం వరి సాగు చేసినట్లు రైతు కైపు రమణారెడ్డి తెలిపారు. ఎకరానికి దాదాపుగా వరి కోతకొచ్చే సమానికి దమ్ముకు రూ.10వేలు, నాటు కూలి కలిపి రూ.6వేలు, నాలుగు సార్లు మందు పిచికారి చేస్తే రూ.12వేలు, కలుపుతో కలిపి మొత్తం రూ.30వేలు కోతనాటి కి పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. అయితే వర్షాలు ఇటీవల పడడంతో వరి ఎక్కువగా పడిపోవడంతో మిషన్లతో కోయడానికి వీలుపడలేదని తెలిపారు. దీంతో పొలాల్లో మనుషులతో కోయిస్తున్నట్లు రైతు వెంకయ్య తెలిపారు. దీనితో అందరూ కోతలు మొదలు పెట్టడంతో వరి పడినందువలన ఎకరానికి రూ.4వేలు కూలీ ఇచ్చి వరి కోయిస్తున్నట్లు రైతు యార్ల నాగేశ్వరరావు తెలిపారు. తర్వాత కోత, కొట్టుడు కలిపి రూ.10వేలు అవుతున్నట్లు తెలిపారు.

అయితే వరి ఒక్కసారిగా కోతకు రావడంతో కూలీలకు డిమాండ్ పెరిగిందని యార్ల నాగమణి ప్రజాశక్తి

వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌తో తూర్పు చేస్తున్న రైతు రమణారెడ్డి

తెలిపారు. తనకు 3 ఎకరాలు పొలం ఉందని, అంతా ఇటీవల వర్షానికి పడిపోవడంతో ఎకరానికి రూ.4200 ఇచ్చి కోయిస్తున్నట్లు తెలిపారు. అయితే కూలీలు రాక, సమయానికి కోయకపోతే పంట రాలిపోయే ప్రమాదం ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ విధంగా చుట్టూ గ్రామాల నుండి కూలీలకు ఒక్కొక్కరికి రూ.700 ఇచ్చి కోయిస్తున్నట్లు నాగమణి తెలిపారు. అంతేకాకుండా కూలీలు వచ్చేందుకు ఆటో ఖర్చులు, మధ్యలో శీతల పానియాల కొరకు అయ్యే ఖర్చు అదనంగా ఉందన్నారు. అయితే మిషన్‌తో కోస్తే ఎకరానికి రూ.5వేలు ఖర్చవుతుందని, అదే కూలీలతో పోస్తే రూ.10వేలు ఖర్చు అవుతుందని అన్నారు. వరిగడ్డికి ఎకరాకు రూ.7వేలు వరకు రాబడి వస్తుందన్నారు. కూలీలు దొరకనందున మిషన్లతో కోస్తే నష్టం తప్ప లాభం ఉండదని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది కొంత మందికి లాభసాటిగా ఉన్న వైట్‌బార్లీ, పొగాకు నారడంతో రోజుకు రూ.700 నుండి రూ.800 కూలీలకు డిమాండ్ పెరిగిందని ఆమె తెలిపారు. ఇట్లా ఒకేసారిగా వరి కోతలు, కుప్పలు, పొగాకు పనులు రావడంతో కూలీలకు బాగా డిమాండ్ పెరిగిందని పలువురు రైతులు తెలిపారు. అయితే ఇంత చేసి ఎకరానికి 30 బస్తాలు పండిస్తే బస్తా రూ.1400 చొప్పున రూ.40వేలు మాత్రమే ఎకరాకు వస్తాయని రైతు వెంకట నారాయణ తెలిపారు. కొంత మందికి 25బస్తాలు మాత్రమే పడినట్లు తెలిపారు. దీంతో కౌలు రైతులకు కౌలు బాకీ తెచ్చి కట్టాల్సి వస్తుందని తెలిపారు. ఈ విధంగా ఏడాది మొత్తం మీద వరి లాభసాటిగా లేకపోవడంతో వచ్చే ఏడాది వరి సాగు చేయకుండా ఉండడమే మేలని పలువురు రైతులు తెలుపుతున్నారు.

ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి

కైపు రమణారెడ్డి ఎకరానికి రూ.40వేలు పెట్టుబడి పెట్టి వరి నాటితే కొన్ని పొలాలలో ఎకరానికి ఎకరానికి 25నుండి 30వస్తాల వరకు పండినట్లు కైపు రమారెడ్డి తెలిపారు. అయితే మొత్తం మీద ఎకరానికి రూ.40వేలు పెట్టుబడి పెట్టి వరి నాటడం నష్టమే కానీ లాభం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కైపు రమణారెడ్డి

కొత్త వెంకటాపురం వద్ద వరి కోస్తున్న కూలీలు

వడ్లను ఆరపెట్టుకుంటున్న రైతు వెంకయ్య

వరి ధాన్యాన్ని కాటా వేసిన రైతు వెంకటనారాయణ

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - దొనకొండ

దొనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు 39 సంవత్సరాల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో ఆదివారం ఆత్మీయంగా కలిశారు. అప్పటి విద్యార్థుల అపూర్వ కలయికతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొన్నది. అందరు కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ స్థాయిల్లో స్థిరపడిన వారంతా ఒకరికొకరు పరిచయాలు చేసుకున్నారు. వారు చదువుకున్న పాఠశాలను కలియతిరిగారు. నాటి పాఠశాల పరిస్థితి నేడు అభివృద్ధి చెందిన పాఠశాల తీరును చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుక రించుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుత కుటుంబ పరిస్థితులను చెప్పుకుని ఆనందంగా గడిపారు. అప్పటి వ్యాయామ ఉపాధ్యాయుడు ఈ కలయికలో పూర్వ విద్యార్థులతో కలిసి పాలుపంచుకున్నారు. దాదాపు 39 సంవత్సరాల తర్వాత ఇలా కలుసుకోవటం ఎంతో సంతో'ంగా ఉందని, నేటి కలయికను ఎన్నడూ మరచిపోలేమని పలువురు ఆనంధం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్‌హాలు నిర్మాణంకు తమవంతుగా సహకరించాలంటూ పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన పూర్వపు విద్యార్థి రమణ తనవంతుగా రూ.25వేలు అందిస్తానని ప్రకటించారు. గ్రూపు తరుపున తమవంతు సహకారం అందిస్తామని పలువురు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఆట, పాటలు, సాంస్కృతికయ కార్యక్రమాలు నిర్వహించారు.

నాటి గురువుతో పూర్వపు విద్యార్థులు

13 నుంచి బాల్‌బాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని డిజిపేట గ్రామంలో ఈనెల 13 నుంచి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వాహకులు షేక్ అబ్దుల్ ఖాదర్, గోదాసు రామ్మోహన్, షేక్ దస్తగిరి తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.7,016, రూ.5,016, రూ.3,016 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.100 ప్రవేశ రుసుము చెల్లించి పోటీలలో పాల్గొనాలని కోరారు. నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 94928 18320, 89853 13950 నెంబర్లలో నిర్వాహకులను సంప్రదించాలని తెలిపారు.

బైకులు ఢీకొని ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

ప్రమాద వశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని గణేషనపల్లి గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగింది. చెన్నపునాయుని పల్లి గ్రామానికి చెందిన పోలేపల్లి రఘు రాములు మోటార్ సైకిల్‌పై గణేషనపల్లి నుంచి చెన్నపునాయునిపల్లికి వెళుతుండగా వి బైలు నుంచి గణేషనపల్లికి వస్తున్న మరో మోటారు సైకిల్ డీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో రఘురాములుకు గాయాలు కాగా ఆర్ఎంపి వైద్యాశాలలో చికిత్స చేయించారు. రోడ్డుపై వున్న గోతులను తప్పించే క్రమంలో రెండు మోటారు సైకిళ్లు డీ కొట్టుకున్నట్లు వాహన దారులు తెలిపారు. గుంతల రోడ్డుతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు చెబుతు న్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

కళాశాలలో గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉద్యాన కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

కదిరి బాబురావు ఉద్యాన కళాశాలలో ఆదివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. 2020 - 25 విద్య సంవత్సరం విద్యార్దులు బిఎస్‌సి హార్టికల్చర్ పూర్తి చేసుకొని డిగ్రీ పట్టా పొందారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్నగౌడ్ విద్యార్థులకు డిగ్రీ ప్రొవిజన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్దులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలకు హాజరైన ఉపాధ్యాయులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలకు హాజరైన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

కాకినాడలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలకు యుటిఎఫ్ మండల సభ్యులు ఆదివారం హాజరయ్యారు. జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో జరుగుతున్న రాష్ట్ర స్వర్ణోత్సవ వేడుకలకు హాజరైనట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ సురేష్ తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలు చాలా అద్భుతంగా జరుగుతున్నాయని తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలకు హాజరైన వారిలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ పాదుషా, కోశాధికారి కె వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకులు జె వెంకటరావు, శ్రీనివాసరాజు, జి లక్ష్మీనారాయణ, వి సాంబశివరావు, ఎన్ తిరుపతయ్య, ఎం కిరణ్‌కుమార్, జి వెంకటేశ్వర్లు, కె మహేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

సర్పంచిని పార్టీలోని చేర్చుకుంటున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్

ప్రజాశక్తి - దొనకొండ

వైసిపికి చెందిన మండలకేంద్రమైన దొనకొండ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సమక్ష్యంలో ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సర్పంచ్ రత్నకుమానితీ, ఆమె అనుచరులకు టీడీపీ కండవాలు మెడలో వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో వైసిపి నిర్లక్ష్యం కారణంగా గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయాయని అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం గత ఏడు నెలల పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కె సుబ్బారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎండుగడ్డి ధరలకు రెక్కలు

ట్రాక్టర్ గడ్డి రూ. 15 వేలు..

అధిక ధరలతో అల్లాడుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వ్యవసాయ రంగంలో ఆధునికత పెరుగుతున్న నేపథ్యంలో సాగుకు పశువులతో అవసరం లేకుండా పోతోంది. పాడి పశువులకు గ్రాసం (ఎండు గడ్డి) దొరకని పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో పాడి రైతులు పశు గ్రాసం కోసం నానా అవస్థలు పడవలసి వస్తోంది. సాధారణంగా వ్యవసాయం చేసే రైతులకు పాడి సంపద కూడా తోడై ఉంటుంది. దుక్కుల నుంచి పంట కోతలు, ధాన్యం రవాణా మొదలైన పనులకు గతంలో పశువులను ఎక్కువగా ఉపయోగించేవారు. అంతేకాకుండా పాల ఉత్పత్తికి కూడా పశువులను పెంచడం పరిపాటిగా ఉండేది. అయితే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో వ్యవసాయంలో పశువుల అవసరం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. అయితే పాల ఉత్పత్తులకు మాత్రం వీటి అవసరం ఉండటం వల్ల చాలామంది రైతులు పాడి పశు వులను పెంచుతూ వస్తున్నారు. అటువంటి వారికి పశుగ్రాసం కొరత తీవ్రంగా వేధిస్తోంది. యర్రగొండపాలెం మండలంలో తెల్ల పశువులు 4074, గేదెలు 12,859, పుల్లలచెరువు మండలంలో తెల్ల పశు వులు 4961, గేదెలు 15,185, త్రిపురాంతకం మండలంలో తెల్ల పశువులు 4873, గేదెలు 18,190, పెద్దారవీడు మండలంలో తెల్ల పశువులు 3871, గేదెలు 8990 ఉన్నాయి.

విక్రయానికి సిద్ధంగా ఉన్న వరిగడ్డి లారీలు

ఎండు గడ్డికి పెరిగిన డిమాండ్..

ఆధునిక వ్యవసాయ విధానాలలో భాగంగా నాట్ల నుంచి కోతల వరకు యంత్రాలను ఉపయోగిస్తున్న తరుణంలో పశుగ్రాసంగా ఎక్కువగా ఉపయోగించే ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. పండిన పంటను కూలీల సాయంతో కోత కోసి, ఆ పనలను నూర్పిళ్ల చేయడం ద్వారా ఎండు గడ్డిని పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ విధంగా వచ్చిన ఎం డు గడ్డిని వాములుగా వేసి, తిరిగి పంట వచ్చే వరకు పశువుల పెంపకందారులు ఆ గడ్డిని వాటిని మేతగా వేసేవారు. మధ్యలో ఇతర దాణాలు ఉన్నా ఎండు గడ్డినే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అయితే వరి పంట కోతలలో 90 శాతం పైబడి యంత్రాలను ఉపయోగిస్తుండటంతో ఎండుగడ్డి దొరకడం లేదు. యంత్రాలతో పంటను కోసే సమయంలో గడ్డి పరకలు ముక్కలు ముక్కలుగా తునా తనకలవడంతో వాటిని పొలంలోనే వదిలేస్తున్నారు. దీంతో ఎండు గడ్డికి కొరత ఏర్పడుతోంది. ఎక్కడైనా కూలీల ద్వారా కోతలు జరిగాయని తెలిస్తే చాలు ఎండు గడ్డి అవసరమైన వారు ఆయా ప్రాంతాలకు వెళ్లి, అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

ఎండు గడ్డికి ప్రత్యామ్నాయం లేదు..

ఎండు గడ్డికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో నిన్నటి వరకు పనికిరాదని పొలాల్లో వదిలేసిన ముక్కలైన గడ్డికి కూడా నేడు డిమాండ్ పెరుగుతోంది. యంత్రాలతో కోతలు అయిన తరువాత ముక్కలుగా పడివున్న గడ్డిని పోగులు చేసి, కట్టలు కట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో కట్ట రూ.35 నుంచి రూ.50 రేటు ఉంటే దానిని రవాణా చేసేందుకు మరో రూ.35 చెల్లించవలసి వస్తోంది. అంటే ఒక కట్ట గడ్డికి కొనుగోలుదారు రూ.70 పైనే భారాన్ని భరించ చక తప్పడం లేదు. ఇక అసలైన ఎండు గడ్డి దొరికిందంటే పండగే అని చెప్పాలి. ట్రాక్టరు గడ్డి గతంలో రూ.ఎనిమిది వేలకు దొరికేది. కానీ ప్రస్తుతం అది రూ.15 వేలు పైగానే పలుకుతోంది.

ఎండుగడ్డి కొరతను నివారించాలి

కూలీల సమస్యలతోను, సమయాభావం వలన రైతులు సాగుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. ఈ కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. ముఖ్యంగా రోజువారీ పశువుల పెంపకంలో ఒక్క పశువుకు ఆరు కిలోల వరకు ఎండు గడ్డిని, 8 కిలోల వరకు పచ్చిరొట్టను వేస్తారు. పచ్చిరొట్ట దొరకకపోతే ఆ లోటును ఎండుగడ్డి ద్వారానే తీర్చవలసి వస్తుంటుంది. ఇటువంటి పరిస్థితులలో ఎండు గడ్డి లేకపోతే కష్టం.

బాలు నాయక్, రైతు, మెట్టబోడుతాండా

ట్రాక్టరు గడ్డికి రూ.15 వేలు అయింది

ప్రస్తుతం ఎండుగడ్డి దొరకడం గగనమై పోతోంది. ఎక్కడైనా ఉంది అంటే చాలు పశువుల పెంపకందారులు పరుగులు పెడుతున్నారు. దీంతో అమ్మేవారు ధరను పెంచేస్తున్నారు. వివరకు యంత్రాలతో కోతలు కోసిన చోట ముక్కలైన గడ్డి కూడా ప్రస్తుతం దొరకడం లేదు. వారం రోజుల క్రితమే ట్రాక్టరు ఎండుగడ్డిని రూ.15 వేలు ఇచ్చి కొనవలసి వచ్చింది. లారీ గడ్డి రూ. 50 వేలు పలుకుతుంది.

\- జనార్ధన్‌రెడ్డి, రైతు, గంజివారిపల్లి



అశోక్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న సిరాజుద్దీన్

అశోక్ బాబుకు సిరాజుద్దీన్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వైసీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సయ్యద్ సిరాజుద్దీన్ తనకు పదవి రావటానికి కారకులైన వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబును ఆదివారం తన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను కర్తవ్యంతో నిర్వర్తించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. అశోక్ బాబును శాసనసభ్యులుగా గెలిపించుకునేవరకు తన శక్తివంతన లేకుండా పనిచేస్తానని హామీనిచ్చారు. అశోక్ బాబు మాట్లాడుతూ నిబద్ధతతో పార్టీకి కట్టుబడి పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేసి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో ఉండాలన్నారు. అదేవిధంగా వేమూరు నియోజకవర్గంలో మరో మారు వైసిపి జెండాను ఎగిరేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొత్తరావు పిచ్చయ్య శాస్త్రి, మద్దుల గిరిధర్, అబ్దుల్లా, వేల్పూరు నాగేశ్వరరావు, చిన్నారి, కుక్కల భూషణ్ రావు, కోటేశ్వరరావు, కొతరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కొండారెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి-కొండపి

కొండపి గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహ ట్రస్టు చైర్మన్ యల్లావుల కొండారెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. తెలుగు కళారత్న సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రాగూర్ గ్రంథాలయంలో జానపద సంక్రాంతి జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డికి ఉత్తమసేవా పురస్కారం నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దిశెట్టి శామ్యూల్, యువి రత్నం, ఉషారాణి పాల్గొన్నారు.

సేవా పురస్కారం అందుకుంటున్న కొండారెడ్డి

'విద్యోన్నతి' స్కాలర్‌షిప్‌కు రాత పరీక్ష

ప్రజాశక్తి -పంగులూరు

విద్యోన్నతి ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌కు ఆదివారం పంగులూ రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో మండలంలోని ఆరు హైస్కూల్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. రిటైర్డ్ హెడ్మాస్టర్ కె.వీరాంజ నేయులు, విద్యోన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ బోడెపూడి జయ శంకర్లు మాట్లాడుతూ పరీక్ష రాసిన వారిలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఇంటర్ చదివే రెండు సంవత్సరాలకు సంవత్సరానికి రూ.10 వేలు చొప్పున అందజేస్తామని తెలిపారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అద్దంకి: విద్యోన్నతి ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌కు పట్టణంలోని బాయ్స్ హై స్కూల్‌లో పరీక్షలు నిర్వహించారు. ముందుగా కృష్ణన్ పేపర్లను అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు ఆవిష్కరించారు. 126 మందికి గాను 120 మంది హాజరయ్యారు.

11 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-మార్టూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా ద్రోణాదుల, కోలల పూడి గ్రామాలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోలలపూడి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 11వ తేదీన మండల స్థాయి సీనియర్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.7,116, రూ.5,116, రూ.3,116 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి 97057 02377 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలో మార్టూరు, అద్దంకి, కొరిశపాడు, జే.పంగులూరు, యద్దనపూడి, ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు, చీరాల మరియు వేటపాలెం మండలాల వారు మాత్రమే పాల్గొనాలని ఇతర ప్రాంతాల వారికి ప్రవేశం లేదని వారు తెలిపారు.

13న ద్రోణాదుల గ్రామంలో..

ద్రోణాదుల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాంతీయ షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ డబుల్స్ పోటీలు ఈనెల 13వ తేదీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలు 45 సంవత్సరాల వయసు పైబడిన వారు మరియు 45 సంవత్సరాల వయసు లోపు వారు రెండు విభాగాలుగా విభజించి నిర్వహిస్తామని తెలిపారు. రెండు విభాగాలలోను విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారికి వరుసగా రూ.8,001, రూ.5,001, రూ.3,001, చొప్పున మొత్తం ఆరు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. పోటీలో పాల్గొను అభ్యర్థులు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు భోజనం, అల్పాహారం కమిటీ వారు ఏర్పాటు చేస్తారని, 45 సంవత్సరముల వయసు పైబడిన విభాగంలో పోటీ చేయు అభ్యర్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. మార్టూరు, అద్దంకి, కొరిశపాడు, జే.పంగులూరు, యద్దనపూడి, ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు, చీరాల మరియు వేటపాలెం మండలాలకు చెందిన వారు మాత్రమే అయి ఉండాలని తెలిపారు. వివరములకు 99595 76009 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కొడవలివారిపాలెంలో మెగా మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి- కారంచేడు

మండలంలోని కొడవలివారిపాలెం గ్రామంలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చి క్యాంపస్‌లో బాపట్ల డీఆర్‌డిఏ ఇన్సూరెన్స్ విభాగం అధికారి టి.థామస్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంపులో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరావు హాజరై రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపుకు హాజరైన కొడవలివారిపాలెం, స్వర్ణపాలెం, కేశవరప్పాడు గ్రామస్తులు అందరికి బిపి, షుగరు, ఈసీజీ మొదలైన పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఎవరికైనా గుండెకు సంబంధించిన సమస్యలు ఉంటే తక్కువ ఖర్చుతో డాక్టర్ ఫీజు లేకుండా పరీక్షలు చేసి కావాల్సిన వైద్య సేవలు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఇలాంటి మెడికల్ క్యాంపులను ప్రజలందరూ ఉపయోగించుకొని మీ ఆరోగ్యాన్ని ముందుగానే పరీక్షలు చేసుకొని ఆరోగ్య విషయంలో ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ టి.రాజేంద్ర బాబు ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలని తెలియజేశారు.

బాగా చదువుకొని

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా

మహిళలతో మాట్లాడుతున్న రాజీవ్‌రంజన్‌మిశ్రా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, మద్దిపాడు

ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా విద్యార్థులకు సూచించారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా ఆదివారం జిల్లాలోని మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో, ఒంగోలులో విస్తృతంగా పర్యటించారు. తొలుత మద్దిపాడు మండల కేంద్రంలోని మాదిగపల్లి కాలనీని సందర్శించిన రాజీవ్ రంజన్‌మిశ్రా, ఆ కాలనీ వాసులతో ముఖాముఖి మాట్లాడారు. వారి జీవన పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వారివారి సమస్యలను కమిషన్ చైర్మన్‌కు విన్నవించుకుని అర్జీలను అందచేశారు. అనంతరం మద్దిపాడులోని ప్రభుత్వ బాలుర వసతిగహాన్ని సందర్శించి.. పిల్లలు ఎలా చదువుకుంటున్నారు, వసతులు ఎలా కల్పిస్తున్నారు మరియు బోధన విధానాలను గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వంట గదిని, మెనూను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ విద్యార్థులతో మమేకమై వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించి, పిల్లలతో పాఠ్యాంశాలు చదివించారు. అనంతరం ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, నాగులుప్పలపాడు మండలం, మద్దిరాల పాడు గ్రామంలోని ఎస్.సి కాలనీని సందర్శించారు. ప్రతి వీధీ తిరిగి కాలనీవాసులతో ముఖాముఖి మాట్లాడారు. వారి జీవన పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వారివారి సమస్యలను కమిషన్ చైర్మన్‌కు విన్నవించుకుని అర్జీలను అందజేశారు. తదుపరి ఏకసభ్య కమిషన్ చైర్మన్ ఒంగోలులోని భాగ్యనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతిగృహం 2, 3లను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ వివరాలు, వసతి సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంట గదిని పరిశీలించారు. విద్యార్థులతో మమేకమైన చైర్మన్, వసతి గహంలో అందుతున్న వసతులు, భోజన వసతులు తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏకసభ్య కమిషన్ చైర్మన్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి అర్జున్ నాయక్, సంబంధిత మండలాల తహశీల్దార్లు, ఎం.పి.డి.ఓలు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-పీసీపల్లి

వర్షాల వల్ల నష్టపోయిన కంది, మినుము రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.జయంతి బాబు, పమిడి వెంకటరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రామగోవిందాపురం, బుద్ధారెడ్డిపల్లిలోని పంటలను పరిశీలించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్సూరెన్స్‌తో సంబంధం లేకుండా కంది, మినుము రైతులకు ప్రతి ఒక్కరికీ నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మినుము సాగు చేసి.. పంట నష్టపోయిన వారికి, తక్కువ దిగుబడి వచ్చి నాసిరకం ధాన్యం వచ్చిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. గింజ తడిసి పొట్టు రాలిపోయి నాసిరకంగా ఉన్న బూజుపట్టిన మినుములను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు పెట్టిన పెట్టుబడితో పాటు తిరిగి అదనంగా కొంత చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. కంది, మినుము సాగు చేసిన రైతులు మండలంలో పూర్తిస్థాయిలో నష్టపోయారని తెలిపారు. రకరకాల తెగుళ్ళ సోకి గింజ కూడా రాని పరిస్థితి ఉందన్నారు. వ్యవసాయ శాఖ వారు వెంటనే మండలం మొత్తం సర్వే చేసి నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినుము కాపునకు రాకుండానే కొంత నష్టపోయారని, మరికొంత పైరు వచ్చినప్పటికీ కాయలోనికి నీరు చేరి బూజు పట్టి, చేదుగా వచ్చాయన్నారు. గింజ నాణ్యంగా లేకపోవడం వల్ల వ్యాపారులెవరూ కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిపారు. కావున మినుమును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం సీనియర్ నాయకులు పిల్లి తిప్పారెడ్డి, పిసిపల్లి మండల అధ్యక్షులు మేడం చిన్నబ్రహ్మారెడ్డి, నాయకులు నారపరెడ్డి పెదమాలకొండయ్య, నారపరెడ్డి మాలకొండయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పేద, బలహీనవర్గాలకు

పక్కాగృహాల నిర్మాణం కోసం కృషి

జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేద, బలహీనవర్గాల వారందరికీ పక్కాగృహాల నిర్మాణం కోసం కృషి జరుగుతోందని జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో నిరుపేదలందరికీ సొంత ఇంటి కోసం గహ నిర్మాణాలకు ఆర్థిక చేయూతనందిస్తున్నామన్నారు. జిల్లాలో జరుగుతున్న గృహనిర్మాణాలు వాటి పురోగతిపై ఆ శాఖ జిల్లా అధికారి వై.వెంకటేశ్వరరావు ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

బాపట్ల జిల్లాలో నియోజకవర్గాల వారీగా వేమూరులో 15,268, రేపల్లె 8,679, బాపట్ల 5,953, పర్చూరు 7.824, అద్దంకి 8,666, చీరాలలో 4,025, మొత్తంగా 50,415 పక్కా గృహాలు మంజూరయ్యాయి. 289 కాలనీల ద్వారా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 17,094 వేల గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. పక్కాగృహాలు మంజూరు అయిన వాటిలో ఇంకా నిర్మాణాలు జరగనివి 11,901 గృహాలు ఉన్నాయి. వివిధ దశల్లో 21,420 గృహాలు ఉన్నాయి. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితంగా పూర్తి చేసే కృషి జరుగుతోంది. ఈ నెలలో సంక్రాంతి పండుగ అనంతరం జిల్లాలో 2,402 గృహప్రవేశాల లక్ష్యంగా కృషి జరుగుతోంది. ఇప్పటికే 1,816 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 586 గృహాల నిర్మాణ పనులు పూర్తి చెయ్యాల్సి ఉంది.

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంతో నిరుపేదల సొంతింటి కల సాకారం చేసే కృషి జరుగుతోంది. గృహనిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే నగదుతో పాటు స్వయం సహాయక సంఘాలలోని సభ్యులుగా ఉన్న మహిళలందరికీ ప్రభుత్వం అదనపు రుణాలు ఇస్తున్నాం. ఆ రుణాలకైనా వడ్డీ సొమ్ము లబ్ధిదారులకు భారం కారాదని ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తోంది. గృహనిర్మాణాల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పక్కాగృహాల నిర్మాణాలపై ప్రత్యేకశ్రద్ధ పెట్టడం జరిగింది.

జిల్లాలో లోతట్టు ప్రదేశాల్లో ఉన్న కాలనీల సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. అంతర్గత రహదారుల నిర్మాణాలు, విద్యుత్, గృహాల కట్టుబడి కోసం నీటి వసతి కల్పించాం. కాలనీలలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కా గహాలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. కావలసిన సౌకర్యాలు సమకూరుస్తున్నారు. పక్కా గహాలను నిర్మించుకోలేక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకు కావలసిన చేయూతనందిస్తున్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇటుకలు లభించేలా చర్యలు చేపట్టడం జరిగింది. రాష్ట్రప్రభుత్వం ఒక్కొక్క ఇంటి నిర్మాణం కోసం 20 టన్నుల ఇసుక, సిమెంట్ 100 బస్తాలు, స్టీల్ 480 కిలోల చొప్పున దశల వారీగా ఇవ్వడం జరుగుతోంది. లబ్ధిదారులు కోరితే రెడిమేడ్‌గా తయారు చేసిన దర్వాజాలు, కిటికీలు ఇస్తున్నారు. ఇలా మొత్తంగా రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇస్తోంది. పొదుపు గ్రూపుల్లో ఉన్న మహిళా గృహ లబ్ధిదారులకు అదనంగా రూ.35 వేలు రుణంగా ఇస్తున్నారు. ఉపాధి హామీ ద్వారా 90 రోజుల పనిదినాలు కల్పించే చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడానికి కావలసిన పూర్తి సహకారాన్ని అందిస్తున్నాం. బిల్లులు కూడా ఎప్పటికప్పుడు విడుదల అవుతున్నాయి. ప్రస్తుత కాలం గృహనిర్మాణాలకు అనుకూలం అయినందున పక్కాగృహాల మంజూరు పొందిన లబ్ధిదారులు త్వరితంగా గృహాలు నిర్మించుకోవాలి.

పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయడం కోసం వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో గృహ నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి జిల్లాలో జరుగుతున్న గృహనిర్మాణాలపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో మంజూరు అయిన వాటిలో 11 వేల గృహాల నిర్మాణాలు ఇంకా మొదలు కాని నేపథ్యంలో ఇందుకు గల కారణాలను తెలుసుకుని సదరు గృహాల లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలు జరుపుకునేలా చర్యలు తీసుకుంటాం. వివిధ దశల్లో 21 వేల గృహాలు ఉన్నందున అందుకుగల కారణాలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపుతున్నాం. సొంత స్థలం ఉండి పక్కాగృహం నిర్మించుకునే వారు స్థానికంగా ఉన్న గృహనిర్మాణశాఖ అధికారుల నుంచి మంజూరు పొందొచ్చు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు

వైద్యుల సూచనలు పాటించాలి

- ప్రముఖ న్యూరో వైద్యనిపుణులు డాక్టర్ శివన్నారాయణ

- దాచూరి రామిరెడ్డి మెడికల్ క్యాంపునకు విశేష స్పందన

మాట్లాడుతున్న డాక్టర్ శివన్నారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా వైద్యుల సూచనలను పాటించాలని ప్రముఖ న్యూరో వైద్య నిపుణులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ సూచించారు. ఆదివారం నాడు స్థానిక టిటిడి కళ్యాణమండపంలో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన మెడికల్ క్యాంపునకు విశేష స్పందన వచ్చింది. మెడికల్ క్యాంప్ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ రకరకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వాడటంతో పాటు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు తరచూ వైద్యపరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. గత తొమ్మిదేళ్లగా క్రమం తప్పకుండా రెండు నెలలకోసారి మెడికల్ క్యాంపు నిర్వహించడం పట్ల రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులను, వైద్యనిపుణులను అభినందించారు. క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాతో పాటు బాపట్ల, నెల్లూరు నుంచి 1575 మంది పేషెంట్లు వైద్యసేవలు పొంది నట్లు వివరించారు. క్యాంపులో బిపి, షుగర్, ఫిట్స్ వంటి వ్యాధులకు రెండు నెలలకు సరిపడా మందులు కేవలం రెండు వందలకే అందించామన్నారు. అవసరమైన రోగులకు తక్కువ ధరకే ఇన్సులిన్ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు నిర్వహణ కోసం చీమకుర్తికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.జవహర్ రూ.పది వేలు, డాక్టర్ సుబ్బారెడ్డి రూ.పది వేలు, ఆంజనేయులు (బిఎస్ఎన్ఎల్) రూ.ఐదు వేలు, కరవది సుబ్బారావు రూ.రెండు వేలు ఆర్థిక సహకారం అందించారు. ప్రతి క్యాంపునకూ ఆర్థిక సహకారం అందిస్తున్న దాతలకు వెంకటరావు కతజ్ఞతలు తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచి 12గంటల వరకు జరిగిన ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ శివన్నారాయణతో పాటు డాక్టర్ బి.హరిబాబు, డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ యం శరత్, డాక్టర్ జి చైతన్య, డాక్టర్ రంజిత్ భాషా, డాక్టర్ సుందర్ ప్రసాద్, డాక్టర్ సమీర్ వైద్య సేవలు అందించారు. ఈ క్యాంపులో సుమారు 150 మందికి పైగా వాలంటీర్లు రిజిస్ట్రేషన్, టోకెన్, టెక్నికల్, ఫార్మసీ, కౌన్సిలింగ్ వంటి సేవలందించారు.

వైద్యశిబిరానికి హాజరైన పేషెంట్లు